

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV — STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 259 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం, 20, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



# విద్యా వ్యవస్థలలో.. వెన్నుపోటుదారులు!



- విద్యా "వ్యవస్థలలో" వెన్నుపోటు దారులు
- విద్యార్థులను వెంటాడుతున్నారు
- విద్యా వ్యవస్థను ఆగం పట్టిస్తున్నారు
- విద్యార్థులను రెచ్చగొట్టడమే అధికారులు లక్ష్యంగా పెట్టుకుంటున్నారు
- విద్యావ్యవస్థలో అన్ని వైశామ్యాలే
- విద్యార్థులపై ఎప్పుడు లేని దాడులు చేస్తున్నారు
- పాలిటెక్నిక్ విద్యార్థులపై విపరీతమైన దాడులు చేసారు
- విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన పద్ధతి ఇదేనా
- నిరుద్యోగులను నిండముంచుతున్నారు
- ఆకాశానికి తాకుతున్న తెలుగు రాష్ట్రాల అప్పుల బెడద
- తెలుగు రాష్ట్రాల్లో విద్యావ్యవస్థ క్షీణించిపోతుంది
- చదువుకు దూరమవుతున్న లక్షలామంది విద్యార్థులు
- డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

విద్యా వ్యవస్థలను బలోపేతం చేసే క్రమంలో విద్యార్థులను తీవ్రంగా అణిచివేస్తున్నారని డాక్టర్ బరిగెల శివ ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్మెంట్ సకాలంలో విడుదల చేయకుండా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యార్థులను వేధిస్తున్నాయన్నారు.విద్యా హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న విద్యార్థులపై పోలీసులతో దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. మహబూబాబాద్ లో పాలిటెక్నిక్ విద్యార్థులు కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించగా అక్కడే బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సిఐ రఘుపతి రెడ్డి విద్యార్థులపై ఒక్కసారిగా విరుచుకుపడుతూ విద్యార్థుల మెడలు పిసుకుతూ నెట్టివేయడం తోసి వేయడం పలువురు విద్యార్థులను కాలర్లు పట్టుకొని మెడలు పట్టుకొని లాగడం సిఐ తీరు పట్ల తీవ్రమైన విమర్శలు వస్తున్నాయని హెచ్చరించారు.విద్యార్థులను పోలీసులు వీధి రౌడీల కన్నా హీనంగా చూస్తున్నారని వాపోయారు.మట్టుకైతే ప్రభుత్వాలు విద్యా వ్యవస్థల పట్ల అంకితభావంతో పరిపాలన కొనసాగించాల్సి ఉంటుండగా ప్రైవేట్ విద్యా సంస్థలపై తల్లి ప్రేమ కనపరుస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలపై కపట ప్రేమను కనపరుస్తున్నారని నిలదీశారు.తెలుగు రాష్ట్రాల్లో వేల కోట్ల రూపాయల విద్యార్థులల ఫీజుల బకాయిలు పేరుకుపోయి ఉంటుండగా విద్యా వ్యవస్థ బలోపేతం చేయబడడం సాధ్యమేనా అంటూ ప్రశ్నించారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో కూడా ఊహకందని ఫీజులు పెంచి విద్యార్థుల నుండి బలవంతంగా వసూళ్లు చేస్తున్నారని అలాంటప్పుడు పేద విద్యార్థులు వాళ్ళు చదువుకుంటున్న కోర్సులకు చెల్లించాల్సిన అధిక మొత్తంలోని ఫీజులను ప్రభుత్వ విద్యాసంస్థలకు ఏ విధంగా చెల్లించగలరు అంటూ ప్రశ్నించారు.ఒకవైపు విద్యాసంస్థలలో విపరీతమైన అవినీతి దోపిడీకి పాల్పడుతుండగా విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజుల మోత విద్యార్థులపై పెను భారాన్ని మోపుతుందని బాధ వ్యక్తం

- మిగతా 2లో..



**డాక్టర్ బరిగెల శివ**

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



## గురువునే కడతేర్చిన విద్యార్థులు

గంజాయి మత్తులో ఘోరం

జల్సాల కోసం డబ్బు కావాలని..

పాఠాలు చెప్పిన గురువునే హత్య చేసిన విద్యార్థులు

నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో సంచలనం







2

## వరంగల్ సీకేఎం మెటర్నిటీ హాస్పిటల్‌లో జీతాల జాప్యం కలకలం!

రూ.20 వేలు ఇస్తేనే శాలరీ ప్రాసెస్ అంటూ ఆరోపణలు..

ఫిర్యాదు చేసినా వేధింపులు ఆగలేదంటూ నర్సింగ్ ఆఫీసర్ల ఆవేదన..

నెలన్నరగా జీతాల కోసం ఎదురుచూపులు




2


## వరంగల్ మున్సిపాలిటీ లో "ఆర్ఐ"లకు దీర్ఘకాల పోస్టింగ్‌లు!!

మూడు ఏళ్ల నిబంధనకు తూట్లు..

ఒకరు ఆరేళ్లుకు పైగా .. ముగ్గురు నాలుగేళ్లకు పైగా

ఒకే విభాగంలో ఏళ్ల తరబడి

ఆర్ఐల తిష్టపై ప్రశ్నలు




2

## మారుతున్న సవాళ్లకు అనుగుణంగా పోలీసు సిబ్బంది పునర్వ్యవస్థీకరణ: డిజిపి సి. వి. ఆనంద్

ట్రాఫిక్, రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం

గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ నుంచి 513 మంది ఇతర విభాగాలకు బదిలీ

డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టి

రెండు నెలల అటాచ్‌మెంట్ అనంతరం సిబ్బందికి కొత్త బాధ్యతలు



3

# వరంగల్ సీకేఎం మెటర్నిటీ హాస్పిటల్‌లో జీతాల జాప్యం కలకలం!

**రూ.20 వేలు ఇస్తేనే శాలరీ ప్రాసెస్ అంటూ ఆరోపణలు..**
**ఫిర్యాదు చేసినా వేధింపులు ఆగలేదంటూ నర్సింగ్ ఆఫీసర్ల ఆవేదన..**
**నెలన్నరగా జీతాల కోసం ఎదురుచూపులు**




**హన్మకొండ(జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లోని సీకేఎం మెటర్నిటీ హాస్పిటల్‌లో కొత్తగా విధుల్లో చేరిన నర్సింగ్ ఆఫీసర్ల జీతాల ప్రక్రియ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. జూన్ చివరి వారంలో కొందరు, జూలై మొదటి వారంలో మరికొందరు నర్సింగ్ ఆఫీసర్లు విధుల్లో చేరినప్పటికీ ఇప్పటివరకు వారి శాలరీ ప్రాసెస్ పూర్తికాలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్యూటీలో చేరిన వెంటనే జీతాల ప్రక్రియ కోసం తలా రూ.20 వేలు ఇవ్వాలని కొందరు జూనియర్ అసిస్టెంట్లు డిమాండ్ చేసినట్లు నర్సింగ్ ఆఫీసర్లు ఆరోపిస్తున్నారు. దీంతో షాక్‌కు గురైన వారు ఈ విషయాన్ని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ సంబంధిత జూనియర్ అసిస్టెంట్లను పిలిచి మందలించినట్లు, ఇకపై ఎలాంటి డబ్బులు తీసుకోకుండా శాలరీ ప్రాసెస్ పూర్తి చేస్తామని హామీ ఇప్పించినట్లు తెలుస్తోంది. అయితే తమపై ఉన్నతాధికారులకు ఎవరు ఫిర్యాదు చేశారన్న విషయంపై నర్సింగ్ సిబ్బందిపై కొందరు అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఫిర్యాదు చేశారన్న కారణంతో జూనియర్ అసిస్టెంట్లు కక్ష పెంచుకుని శాలరీ ప్రాసెస్‌ను మరింత ఆలస్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శాలరీ ప్రాసెస్ కోసం అవసరమైన ఫారాలు నింపి ఇచ్చినా వాటిని స్వీకరించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని నర్సింగ్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఉద్యోగంలో చేరి నెలన్నర దాటుతున్నా జీతాల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో కొత్తగా నియమితులైన నర్సింగ్ ఆఫీసర్లు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. రెండు రోజుల క్రితం కూడా శాలరీ ప్రాసెస్ విషయంలో ఆసుపత్రిలో మరోసారి వివాదం జరిగినట్లు సమాచారం. జీతాల ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందో తెలియక, ఉద్యోగం వచ్చిన సంతోషం కంటే ఆందోళనే ఎక్కువగా ఉందని నర్సింగ్ ఆఫీసర్లు వాపోతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం బయటకు వస్తే తమపై మరింత వేధింపులు పెరుగుతాయనే భయంతో కొందరు మౌనంగా విధులకు హాజరవుతున్నట్లు సమాచారం. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు కొత్తగా విధుల్లో చేరిన నర్సింగ్ ఆఫీసర్ల శాలరీ ప్రాసెస్‌ను వెంటనే పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత జూనియర్ అసిస్టెంట్లు, ఆసుపత్రి అధికారుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

# సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలి

**కాకతీయ యూనివర్సిటీలో సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమం**





**వరంగల్, 19 ఆగస్టు 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. ప్రజలు, విద్యార్థులు, యువతలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు "సురక్షా కా తిరంగా" కార్యక్రమంలో భాగంగా కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 200 మంది విద్యార్థులు, ఉద్యోగులు, ఇతరులు హాజరయ్యారు. సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం అనుసరిస్తున్న నూతన మోసపూరిత విధానాలను పోలీసులు వివరించారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి మోసాలు, రిమోట్ యాక్సెస్ యాప్ మోసాలు, బ్యాంకు--కేవైసీ అప్‌డేట్ మోసాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో పోలీసులు, ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ కేసుల్లో ఇరుక్కున్నారని భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పెట్టుబడి మోసాల్లో తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని నమ్మించి నకిలీ పెట్టుబడి పథకాల ద్వారా డబ్బులు దోచుకుంటున్నారని వివరించారు. అనుమానాస్పద యాప్‌లను ఇన్‌స్టాల్ చేయించడం ద్వారా మొబైల్ ఫోన్, బ్యాంకు ఖాతాలపై నియంత్రణ సాధించే అవకాశం ఉందని హెచ్చరించారు. కేవైసీ అప్‌డేట్ పేరుతో వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు సేకరించి మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు వెల్లడించకూడదని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలను ధృవీకరించకుండా స్పందించవద్దని సూచించారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ఓటీపీ, పిన్, సీవీవీ, పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పకూడదని పోలీసులు స్పష్టం చేశారు. పోలీసులు, బ్యాంకు అధికారులు, ప్రభుత్వ అధికారులు ఫోన్ ద్వారా ఓటీపీలు లేదా రహస్య బ్యాంకింగ్ వివరాలను అడగరని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, లేదా ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులు ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం అంత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు, పాల్గొన్న వారికి సైబర్ భద్రతపై అవగాహన పెంచేందుకు సైబర్ అవేర్‌నెస్ క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం. వెంకటరమణ, కేయూసీ సీఐ రవికుమార్, ఎస్‌ఐలు శ్రావణి, చరణ్, హెడ్ కానిస్టేబుల్ పి. శ్రీనివాస్, కానిస్టేబుల్ జాహురుద్దీన్‌తో పాటు ఎస్పార్క్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యా "వ్యవస్థలలో" వెన్నుపోటు దారులు

మొదటి పేజీ తరువాయి

చేశారు. సాంకేతిక కోర్సులు చదువుకుంటున్న విద్యార్థులకు ఫీజులు చెల్లించడం చాలా కష్టం అవుతున్న తరుణంలో ఫీజులు చెల్లించే స్థితిలో లేని లక్షల మంది ఉన్నత చదువులను చదువుకోలేక చదువులు మానేస్తున్నారని మరోవైపు చదువులు పూర్తి చేసుకొని డిగ్రీలు చేత పట్టుకొని 12 సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం పరితపిస్తున్న నిరుద్యోగ యువత ఉద్యోగాలు రాక జీవితాలు చెల్లాచెదరైపోతున్నప్పటికిని ప్రభుత్వాలతో పోరాటాలు చేస్తూ జీవితాలను కొనసాగించలేక అకాల మరణం పొందుతున్నారని బాధపడ్డారు. చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన విద్యను మెరుగైన మౌలిక సదుపాయాలన కల్పించాల్సిన ప్రభుత్వాలు అడపాదడపా సౌకర్యాలతో విద్యార్థుల జీవితాలను ఆగం పట్టిస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగులకు రావలసిన ఉద్యోగాలను కల్పించడంలో ప్రభుత్వాలు ఎప్పుడో పూర్తిగా విఫలమైనాయని వాపోయారు. ప్రైవేట్ ఉద్యోగాల కోసం పాకులాడుతున్న యువత నిజ జీవితాల్లో స్థిరపడలేక ఆగమవుతున్నారని బాధపడ్డారు. విద్యాసంస్థల పరిస్థితి ఒకవైపు అగమ్య గోచరంగా మారిపోతున్నాయని విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తుందని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షాల మాటలను ప్రతిపక్షాల సూచనలను ఏమాత్రం పట్టించుకోని ప్రభుత్వాలు చివరకు విద్యార్థులను కూడా వదిలిపెట్టకుండా వేధింపులకు గురిచేయడం బాధాకరమన్నారు. కేవలం విద్యార్థులను వేధించడం కోసమే ప్రభుత్వ కార్యాలయాలలో అధికార యంత్రాంగం వాళ్ళ అధికార పరిధిలోనే సమస్యలను సృష్టిస్తూ ప్రభుత్వాలను విపరీతంగా బదునం చేస్తున్నారన్నారు.

**సంపన్నులకు "చూడ" చక్కని విద్య..**

ఆర్థికంగా స్థిరపడ్డ కుటుంబాలు ప్రైవేట్ విద్యా సంస్థలలో వాళ్ల వాళ్ల పిల్లలను చదివిస్తూ కోట్ల రూపాయలను ఫీజుల రూపంలో చెల్లిస్తూనే వాళ్లు ఉద్యోగాలలో కొనసాగుతున్న ప్రభుత్వ సంస్థలను విపరీతంగా దోచుకుంటున్నారని హెచ్చరించారు. ఆర్థికంగా స్థిరపడడం కోసం ప్రభుత్వ వ్యవస్థలను అవినీతి అడ్డాలుగా మార్చుకుంటున్న అధికారులంతా వాళ్ల వాళ్ల పిల్లలను బయట ప్రాంతాల్లో చదివిస్తున్నారని ఒకవైపు తెలుగు రాష్ట్రాలలో విద్యా దోపిడిని విద్యా దోపిడీలోని అవినీతిని పెంచి పోషిస్తూనే సంపన్న శక్తులుగా తయారవుతున్న అధికారులు వాళ్లకు సంబంధించిన ఆస్తుల పెంపకాలను క్రమక్రమంగా అభివృద్ధి పరచుకుంటున్నారని తెలియజేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలను చిన్నచూపు చూస్తున్న అధికారులందరూ సంపన్న శక్తి గల హోదాలను అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. పదుల సంఖ్యలో 20ల సంఖ్యలో 30 ల సంఖ్యలో 40ల సంఖ్యలో విద్యాసంస్థలకు అధిపతులుగా ఉంటున్నటువంటి వాళ్లంతా ప్రైవేట్ విశ్వవిద్యాలయాల కోసం ఆర్జి పెట్టుకొని అనుమతులు తెచ్చుకోని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ విద్యా సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని హెచ్చరించారు. అక్రమ అనుమతులతో అక్రమ బిల్డింగులతో అక్రమ భూకబ్జాలతో ఆరితేరిన సంపన్నులుగా చలామణి అవుతూ ప్రైవేటు విద్యాసంస్థలను నిర్మించుకొని విద్యా వ్యవస్థలను పాడు చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో గురుకులాల విద్యా వ్యవస్థ పూర్తిగా పతనావస్థలోనికి నెట్టివేయబడిందని ముఖ్యంగా గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులందరూ కడుపేదలన్న సంగతిని మర్చిపోతున్న ప్రభుత్వం గురుకులాలపై ఇష్టారాజ్యమైన ఆంక్షలను అమలుపరుస్తూ విద్యార్థుల జీవితాలను ఆగం చేస్తుందన్నారు. విద్యా వ్యవస్థలలో పనిచేస్తున్న అధికారులంతా విద్యార్థులకు శాపగ్రస్తులుగా తయారవుతున్నారని విద్యా వ్యవస్థను విద్యార్థుల జీవితాలను అభివృద్ధి పథంలోనికి నడిపించాల్సిన అధికారులంతా వ్యక్తిగత అభివృద్ధిపై కనపరుస్తున్న శ్రద్ధ విద్యా వ్యవస్థల అభివృద్ధిపై కనపరచకపోవడం బాదాకరం అన్నారు. ప్రభుత్వాలను ప్రభుత్వ వ్యవస్థలను సమర్థవంతంగా సక్రమంగా నడపలేని అధికారులు ఎక్కువ శాతం అధికార హోదాల్లో పదవులలో కొనసాగుతున్నారని తీవ్రంగా విమర్శించారు. విద్యార్థులను వేధించడంలో కావాలని ప్రణాళికలు చేసుకుంటూ విద్యార్థుల జీవితాలను అధోగతి పాలు చేస్తున్నారని మండిపడ్డారు. సంపన్నుల పిల్లలకు లేని ఆంక్షలు పేద విద్యార్థులకు మాత్రమే పరిమితులకు మించి అమలుపరచడం అధికారుల గొప్పతనం అనుకుంటున్నారని అధికార హోదాలో అమలుపరుస్తున్న అక్రమాలు అవినీతి కుట్రలన్నీ కాలక్రమేణ తిప్పికొట్టబడక తప్పదని హెచ్చరించారు. అవసరమైతే ప్రభుత్వాలను మెప్పించైన ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సింది పోయి ఒక వైపు దర్జాగా జీతాలు తీసుకుంటూనే మరోవైపు విద్యాసంస్థలలో అవినీతికి పాల్పడుతూ విద్యార్థుల సొమ్మును బలవంతంగా అక్రమంగా తప్పుడు మార్గాల్లో దోచుకుంటున్నారని మరొకసారి హెచ్చరించారు. ఏ విద్యా వ్యవస్థలో చూసిన అధికార హోదాలో కొనసాగుతున్న పిల్లలందరూ సంపన్నమైన విద్యా వ్యవస్థలో విద్యను కొనసాగిస్తున్నారని వాళ్లు మాత్రం ప్రభుత్వ వ్యవస్థలను దోచుకోవడానికి అధికారులుగా కొనసాగుతున్నారన్నది వాళ్ల వాళ్ల పిల్లల చదువులను బట్టి అర్థం చేసుకోగలం అన్నారు. ఒకవైపు కొన్ని జిల్లాల కలెక్టర్లు వాళ్ల పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థలలో చదివిస్తుంటే అవినీతి కుబేరులంతా ఆస్తుల సంపాదన మోజులో పిల్లలను దూరప్రాంతాల్లో నాణ్యమైన విద్య ప్రైవేట్ సంస్థలలో చదివిస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఏది ఏమైనా విద్యార్థులపై అణచివేత దాడులు విద్యార్థులు చదువుకుంటున్న విద్యకు అడ్డంకులు ఆటంకాలు కలుగనివ్వకుండా సక్రమంగా విద్యా కోర్సులు పూర్తి చేసుకోవడానికి తగినటువంటి సౌకర్యాలు మౌలిక సదుపాయాలు ఆర్థిక సదుపాయాలను ప్రభుత్వాల రూపంలో గానీ ప్రభుత్వ వ్యవస్థల అధికారుల రూపంలో గానీ కల్పించగలిగినప్పుడు మాత్రమే తెలుగు రాష్ట్రాలలో విద్యా సమాన హక్కులు ముందుకు సాగగలవని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడిగా పెరిగిపోతున్న విద్యార్థుల నిరసనలు విద్యార్థుల ధర్నాలు విద్యార్థుల హక్కుల కోసం జరుగుతున్న పోరాటాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థల నిర్వీర్యాలను, విద్యా వ్యవస్థల వెనుకబాటుతనాన్ని తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలియజేస్తున్నాయన్నారు.

# గురువునే కడతేర్చిన విద్యార్థులు..

**గంజాయి మత్తులో ఘోరం**
**జల్సాల కోసం డబ్బు కావాలని..**
**పాఠాలు చెప్పిన గురువునే హత్య చేసిన విద్యార్థులు**
**నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో సంచలనం**

**నల్గొండ(జై భీమ్ న్యూస్)**

తల్లిదండ్రులు ఒక్కసారి ఆలోచించాల్సిన ఘటన ఇది. ఇంట్లో పెరుగుతున్న పిల్లలు ఎవరితో తిరుగుతున్నారు? ఏం చేస్తున్నారు? ఎలాంటి అలవాట్లకు లోనవుతున్నారు? అనే విషయాలను గమనించకపోతే పరిణామాలు ఎంత దారుణంగా ఉంటాయో నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో జరిగిన ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య ఘటన కళ్లకు కడుతోంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డిని ఆమెకు పాఠాలు చెప్పిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులే డబ్బుల కోసం హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. గంజాయికి అలవాటు పడిన విద్యార్థులు జల్సాలకు డబ్బులు సరిపోక ప్రిన్సిపల్ ఇంట్లో చోరీ చేయాలని పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 11న సాయంత్రం రూపారెడ్డి ఇంటికి చేరుకునేలోపే ఇద్దరు విద్యార్థులు గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆమె ఇంట్లోకి వచ్చిన తర్వాత వంటగదిలో దాక్కున్న నిందితులు.. ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్లిన సమయంలో వెనుక నుంచి దాడి చేసి కత్తితో పలుమార్లు పొడిచి హత్య చేసినట్లు తెలిపారు. అనంతరం ఆమె వద్ద ఉన్న సుమారు రూ.2 లక్షల నగదును తీసుకుని అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకున్న నిందితులు.. ఆ డబ్బుతో హైదరాబాద్‌కు వెళ్లి జల్సాలు చేసినట్లు దర్యాప్తులో తేలినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

**చదువు చెప్పాల్సిన గురువునే.. కాటికి పంపిన విద్యార్థులు**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన వయసులో.. చెడు వ్యసనాలకు బానిసలై అదే గురువును హత్య చేయడం సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. చిన్న వయసులోనే గంజాయి, మత్తు పదార్థాలు, చెడు స్నేహాలు, విచ్చలవిడి జల్సాలు పిల్లల జీవితాలను ఏ దిశగా తీసుకెళ్తున్నాయో ఈ ఘటన తీవ్రంగా హెచ్చరిస్తోంది.

**పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలి..**

పిల్లల చేతిలో సెల్‌ఫోన్ ఉందా? ఎవరితో మాట్లాడుతున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరితో స్నేహం చేస్తున్నారు? వారి ప్రవర్తనలో మార్పులు ఏమైనా ఉన్నాయా? అనే విషయాలను తల్లిదండ్రులు నిరంతరం గమనించాల్సిన అవసరం ఉంది.

**ఇది ఒక్క కుటుంబానికి సంబంధించిన విషాదం కాదు.. సమాజం మొత్తం ఆలోచించాల్సిన హెచ్చరిక.**

పిల్లలకు చదువుతో పాటు మంచి విలువలు నేర్పాలి. చెడు వ్యసనాలకు దూరంగా ఉంచాలి. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం దృష్టి పెట్టాలి. లేకపోతే ఈరోజు జరిగిన ఘటన రేపు మరో కుటుంబంలో పునరావృతం కాకుండా ఉండేందుకు సమాజం ఇప్పుడే మేల్కోవాల్సిన అవసరం ఉంది.



# ఇంచార్జ్జీ పాలనలో వరంగల్ డీఎంహెచ్ఓ

**ఒకే అధికారికి రెండు కీలక బాధ్యతలు.. పూర్తిస్థాయి డీఎంహెచ్ఓ నియామకం ఎప్పుడూ?**
**సీనియర్ జర్నలిస్టు, సామాజికవేత్త చీర భరత్ కుమార్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బైన రాజు**

**వరంగల్, 19 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో పూర్తిస్థాయి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి లేకపోవడంతో ఇంచార్జ్జీ పాలన కొనసాగుతోందని సీనియర్ జర్నలిస్టు, సామాజికవేత్త చీర భరత్ కుమార్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బైన రాజు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రాజిరెడ్డికి వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి బాధ్యతలను అదనంగా అప్పగించడంపై వారు ప్రశ్నలు లేవనెత్తారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ప్రజారోగ్య కార్యక్రమాల అమలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ, వైద్య సిబ్బంది పరిపాలన, ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య సంస్థల పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలు ఉంటాయని వారు పేర్కొన్నారు. ఇలాంటి ముఖ్యమైన శాఖకు పూర్తిస్థాయి అధికారి లేకపోవడం వల్ల పరిపాలనపై ప్రభావం పడే అవకాశం ఉందని అన్నారు. ఇదిలా ఉండగా, వరంగల్ జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ఇప్పటికీ డాక్టర్ బి. సాంబశివరావును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిగా పేర్కొంటున్నారని తెలిపారు. డీఎంహెచ్ఓ, వరంగల్ రూరల్‌గా కూడా ఆయన పేరే కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం డాక్టర్ రాజిరెడ్డికి ఇంచార్జ్జీ బాధ్యతలు అప్పగించినప్పటికీ అధికారిక వెబ్‌సైట్‌లో పాత అధికారి వివరాలు కొనసాగడం అధికారిక సమాచారంపై గందరగోళానికి కారణమవుతోందని అన్నారు. అధికారుల బదిలీలు, బాధ్యతల మార్పులు జరిగిన వెంటనే ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లలో వివరాలను నవీకరించాల్సిన అవసరం ఉందని వారు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ సమాచారంలో స్పష్టత, పారదర్శకత ఉండాలని కోరారు. వరంగల్ జిల్లాకు పూర్తిస్థాయి డీఎంహెచ్ఓను నియమించడంతో పాటు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లలో అధికారుల వివరాలను తాజా సమాచారంతో అప్‌డేట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిపాలనపై వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయి అధికారి నియామకానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. "అక్కడ నేనే.. ఇక్కడ నేనే.. ఒకే అధికారికి రెండు కీలక బాధ్యతలు.. అసలు ఏం జరుగుతోంది?" అంటూ వారు ప్రశ్నించారు. జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారుల బాధ్యతలు, వివరాలు సక్రమంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయి డీఎంహెచ్ఓ నియామకంపై స్పష్టత ఇవ్వాలని సీనియర్ జర్నలిస్టు, సామాజికవేత్త చీర భరత్ కుమార్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బైన రాజు కోరారు.





# కొండా సుష్మిత వ్యాఖ్యల వెనుక కాంగ్రెస్ అధిష్ఠానం ఉందా?

**రేవంత్ రెడ్డిపై వరుస ఆరోపణలు.. కొండా కుటుంబం వర్సెస్ కాంగ్రెస్ నాయకత్వం మధ్య పెరుగుతున్న దూరం?**

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు తెరపైకి వచ్చాయా? మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు సందర్భంగా ఆమె కుమార్తె కొండా సుష్మిత చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి సుష్మిత చేసిన ప్రశ్నలు, ఆరోపణలు రాజకీయంగా కొత్త చర్చకు తెరలేపాయి. ఈ నెల 13న ఆంధ్రజ్యోతిలో వచ్చిన సంపాదకీయ వ్యాసంలో మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుండగా, ఆ తర్వాత రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటనకు ఆమె దూరంగా ఉండటం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తాజాగా సుష్మిత నేరుగా రేవంత్ రెడ్డిపై ప్రశ్నలు సంధించడం కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయాలపై ఊహాగానాలకు కారణమైంది. తన వ్యాఖ్యలకు స్పందిస్తే రేవంత్ రెడ్డి అవినీతి చిట్టాను బయటపెడతానని సుష్మిత హెచ్చరించినట్లు వచ్చిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం సృష్టించాయి. పరకాల నుంచి రేవూరి ప్రకాశ్ రెడ్డి మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారని ప్రకటించడానికి రేవంత్ రెడ్డి ఎవరని ఆమె ప్రశ్నించడం కూడా చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో తమ తండ్రి కొండా మురళిని ఎమ్మెల్సీ చేస్తానని ఇచ్చిన హామీ ఏమైందని సుష్మిత ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో బీసీ మంత్రుల ఫొటోలు ఎందుకు కనిపించడం లేదని, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఎందుకు స్పందించడం లేదని కూడా ప్రశ్నలు సంధించారు. రూ.200 కోట్ల విలువైన భూమిని రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి ఎలా కట్టబెడతారని ఆమె ప్రశ్నించడం రాజకీయంగా మరింత సంచలనానికి దారితీసింది. రేవంత్ రెడ్డి వెంట ఉన్న 'పొంగు' ఎంతోకాలం కొనసాగదంటూ చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు కారణమయ్యాయి. మేడారం జాతర సమయంలో సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కొండా సురేఖకు మొదలైన విభేదాలు క్రమంగా బహిరంగ రాజకీయ పోరుగా మారుతున్నాయా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. గతంలో సుష్మిత చేసిన ఆరోపణలపై రేవంత్ రెడ్డి వర్గం పెద్దగా స్పందించకపోయినా, తాజా వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో పరిస్థితి మరింత వేడెక్కినట్లు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా, మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసినట్లు వచ్చిన సమాచారం కూడా రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖ వెనుక కాంగ్రెస్‌లోని కొందరు మంత్రులు, కీలక నేతల మద్దతు ఉందా? లేక ఇది కొండా కుటుంబం నుంచి స్వతంత్రంగా వస్తున్న రాజకీయ ప్రతిస్పందనా? అనే చర్చ సాగుతోంది. షబ్బీర్ అలీని ఎందుకు పక్కన పెట్టారని, తమ తండ్రి కొండా మురళికి ఇచ్చిన హామీ ఎందుకు అమలు కాలేదని, సీతా దయాకర్ రెడ్డికి ఎందుకు పదవి ఇచ్చారని సుష్మిత ప్రశ్నించడం కూడా కాంగ్రెస్ అంతర్గత సమీకరణాలపై



చర్చకు దారితీసింది. ప్రస్తుతం కాంగ్రెస్‌లో వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న ఒక్కటే-ఇది కేవలం టీ కప్పులో తుఫానుగా ముగుస్తుందా? లేక 'అసలు కాంగ్రెస్--కొసరు కాంగ్రెస్' మధ్య ఇప్పటికే ఉన్న అంతర్గత విభేదాలకు మరింత ఆజ్యం పోస్తుందా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లే ముందు చోటుచేసుకున్న ఈ పరిణామాలు కాంగ్రెస్ రాజకీయాల్లో మరింత వేడి పెంచుతున్నాయి. కొండా కుటుంబం నుంచి వస్తున్న వరుస వ్యాఖ్యలు వ్యూహాత్మకమా? ఉద్దేశపూర్వకమా? లేక పార్టీలో పేరుకుపోయిన అసంతృప్తికి బహిరంగ రూపమా? అన్నది ఇప్పుడు కాంగ్రెస్ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత నేతల అధికారిక వివరణలు, ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు వెలుగులోకి వస్తేనే వాస్తవ పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# మారుతున్న సవాళ్లకు అనుగుణంగా పోలీసు సిబ్బంది పునర్వ్యవస్థీకరణ: డిజిపి సి. వి. ఆనంద్





**ట్రాఫిక్, రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం**

**గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ నుంచి 513 మంది ఇతర విభాగాలకు బదిలీ**

**డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టి**

**రెండు నెలల అటాచ్‌మెంట్ అనంతరం సిబ్బందికి కొత్త బాధ్యతలు**

**హైదరాబాద్, ఆగస్టు 19 జై భీమ్ న్యూస్:-**

మారుతున్న నేర స్వభావం, ప్రజా భద్రతకు ఎదురవుతున్న కొత్త సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీసు శాఖలో మానవ వనరులను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు తెలంగాణ పోలీస్ అకాడమీ లో బుధ వారం జరిగిన సమావేశంలో డిజిపి సి. వి. ఆనంద్ తెలిపారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదం ప్రధాన సవాళ్లుగా ఉండగా.. ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత, ఆహార కల్తీ వంటి అంశాలు పోలీసులకు కొత్త సవాళ్లుగా మారాయని చెప్పారు.

**513 మందికి కొత్త బాధ్యతలు**

గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ తదితర ప్రత్యేక విభాగాల నుంచి 513 మంది సిబ్బందిని ఎనిమిది విభాగాలకు అవసరాలకు అనుగుణంగా కేటాయించారు. వీరిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు, 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. ఆహార కల్తీ, డ్రగ్ కంట్రోల్‌కు 80 మంది, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు 79 మంది, సివిల్ సప్లయిస్‌కు 28 మంది, డిజిపి కార్యాలయం--టి-స్పార్క్‌కు 27 మంది, ఏసీబీ, సీఐడీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు 25 మంది చొప్పున కేటాయించారు.

**రెండు నెలల అటాచ్‌మెంట్ తర్వాత..**

కొత్త బాధ్యతలు అప్పగించే ముందు సిబ్బందిని వివిధ విభాగాల్లో రెండు నెలల పాటు అటాచ్‌మెంట్‌పై పనిచేయించామని డిజిపి తెలిపారు. ప్రభుత్వ అనుమతితో ఆయా విభాగాల్లో పోస్టుల ఏర్పాటు ఆధారంగా తుది కేటాయింపులు చేశామన్నారు. సిబ్బంది విద్యార్హతలు, అనుభవం, నేపథ్యాన్ని పరిశీలించడంతో పాటు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. కొత్త విభాగాల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ అకాడమీలో 11 రోజుల ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు.

**తీవ్రవాదం నుంచి సైబర్ నేరాల వరకు..**

తెలంగాణలో 1980, 1990 దశకాల్లో వామపక్ష తీవ్రవాదం తీవ్రంగా ఉండేదని డీజీపీ గుర్తుచేశారు. అప్పటి పరిస్థితుల్లో ప్రత్యేక పోలీసు బలగం అవసరమై 1987లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో కేఎస్ వ్యాస్ నేతృత్వంలో ప్రత్యేక విభాగం ఏర్పడిందని తెలిపారు. అదే క్రమంలో గ్రేహౌండ్స్ రూపుదిద్దుకుందని చెప్పారు. గ్రేహౌండ్స్, ఎస్ఐబీ తదితర విభాగాలు మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. 2017 తర్వాత తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని, అయితే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల కర్రెగుట్టల ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడ మౌలిక వసతుల కొరత స్పష్టంగా కనిపించిందని, కొన్ని ప్రాంతాల్లో రహదారులు, పాఠశాలలు, వైద్య సదుపాయాలు ఇంకా మెరుగుపడాల్సి ఉందన్నారు. 2007లో హైదరాబాద్‌లో లుంబినీ పార్క్, చార్మినార్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో ప్రత్యేక కౌంటర్ టెర్రరిజం సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడిందని, దాని ఫలితంగా ఆక్టోపస్ వంటి ప్రత్యేక విభాగాలు అభివృద్ధి చెందాయని డిజిపి వివరించారు.

**విద్యార్థులపై డ్రగ్స్ పంజా**

యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని డిజిపి సి వి ఆనంద్ అన్నారు. గతేడాది 835 మంది విద్యార్థుల్లో డ్రగ్స్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. మరో విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అధ్యయనంలో సుమారు 70 శాతం మంది విద్యార్థులు డ్రగ్స్‌కు గురైనట్లు తేలిందని చెప్పారు. డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా అడ్డుకోవడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను ఇప్పుడే కాపాడుకోకపోతే భవిష్యత్తులో పరిస్థితి మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**సైబర్ నేరాల్లో రూ.1,750 కోట్ల నష్టం**

సైబర్ నేరాలు మరో ప్రధాన సవాలుగా మారాయని డిజిపి తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, నకిలీ యాప్‌ల ద్వారా మోసాలు పెరుగుతున్నాయని చెప్పారు. గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరాల కారణంగా సుమారు రూ.1,750 కోట్ల ఆర్థిక నష్టం జరిగినట్లు తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక విభాగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**రోడ్డు భద్రతకు పెద్దపీట**

తాజా పునర్వ్యవస్థీకరణలో రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు డీజీపీ తెలిపారు. గత ఏడాది తెలంగాణలో రోడ్డు ప్రమాదాల్లో సుమారు 8 వేల మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, అమలును మరింత బలోపేతం చేసేందుకు 224 మంది సిబ్బందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు సేఫ్టీ విభాగానికి కేటాయించినట్లు తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాటికి సంబంధించిన ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక రోడ్డు భద్రత కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

**క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి**

కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్న సిబ్బంది నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని డీజీపీ సూచించారు. శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. కొత్త బాధ్యతలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకుని క్రమశిక్షణతో, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని సూచించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లో ఫీల్డ్ ఆపరేషన్లు, నిర్వహణ, శిక్షణ తదితర అవసరాలకు సరిపడా సిబ్బందిని కొనసాగించినట్లు డిజిపి తెలిపారు. మూడు నెలల అనంతరం సిబ్బంది అవసరాలు, పనితీరును మరోసారి సమీక్షిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆక్టోపస్, సీఐడీ, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ తదితర ప్రత్యేక విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# పిల్లలేంటి ఇలా తయారయ్యారు?.. టీచర్ల భవిష్యత్ ఏమిటి?

**విద్యార్థుల చేతిలో ప్రిన్సిపాల్ హత్య కలచివేసింది.. ఉపాధ్యాయుల భద్రతపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి**



**సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత, డా. మేడపాటి ఇమాన్యుయేల్**

**వరంగల్, 19 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

విద్యార్థుల చేతిలో మహిళా పాఠశాల ప్రిన్సిపాల్ దారుణ హత్యకు గురైన ఘటన సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసిందని సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత, మాజీ లెక్చరర్ డా. మేడపాటి ఇమ్మానుయేల్ అన్నారు. ప్రస్తుత తరంలో విద్యార్థుల మానసిక ప్రవర్తన, తల్లిదండ్రుల బాధ్యత, ఉపాధ్యాయుల భద్రతపై సమాజం సమగ్రంగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రిన్సిపాల్‌ను హత్య చేసింది రౌడీలు, గూండాలు, కుటుంబ సభ్యులు లేదా స్నేహితులు కాదని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులేనని వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమన్నారు. ఇంతటి సంచలన ఘటన జరిగినప్పటికీ దేశవ్యాప్తంగా తగిన స్థాయిలో చర్చ జరగకపోవడం విచారకరమన్నారు. విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టడం, తప్పు చేసినప్పుడు మందలించడం విద్యా వ్యవస్థలో భాగమేనని అన్నారు. అయితే ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రశ్నించడానికి భయపడే పరిస్థితులు ఏర్పడితే విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులకు భద్రత కరువైందని, టీచింగ్ వృత్తి కత్తిమీద సాములా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అల్లరి చేసే విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలో మందలించడం, అవసరమైతే టీసీ ఇస్తామని హెచ్చరించడం ద్వారా క్రమశిక్షణలోకి తీసుకువచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించడమే తమ బాధ్యతగా భావిస్తున్నారని, పిల్లలకు తల్లిదండ్రులే తొలి గురువులు అనే విషయాన్ని విస్మరిస్తున్నారని అన్నారు. "విద్యా దదాతి వినయం" అనే సూక్తి విద్య ద్వారా వినయం, సంస్కారం, క్రమశిక్షణ రావాలని చెబుతోందన్నారు. పాఠశాల నిబంధనలను ఉల్లంఘించిన విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రశ్నించడం తప్పు కాదని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు పాఠశాలకు తీసుకురావద్దని యాజమాన్యం నిబంధనలు విధించడం, వాటిని ఉల్లంఘించిన విద్యార్థులను ప్రశ్నించడం ఉపాధ్యాయుల బాధ్యతలో భాగమేనన్నారు. అయితే మందలించినందుకు ఉపాధ్యాయులపై దాడులు చేయడం, హత్యలకు పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. విద్యార్థుల హక్కులకు ఎంత ప్రాధాన్యం ఉందో, ఉపాధ్యాయుల ప్రాణాలు, గౌరవం, భద్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని పేర్కొన్నారు. నేటి విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులపై పెరుగుతున్న పని ఒత్తిడి, మానసిక ఒత్తిడి, విద్యార్థుల ప్రవర్తన వంటి అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించి, పాఠశాలలు, కళాశాలల్లో సురక్షిత వాతావరణం కల్పించాలని కోరారు. "ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా బొకేలు ఇవ్వడం మాత్రమే కాదు.. నల్లబోర్డుకు అంకితమై పిల్లల జీవితాలను గొప్పగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులను విద్యార్థులు, తల్లిదండ్రులు, సమాజం మొత్తం గౌరవించాలి. వారికి భద్రత కల్పించాలి" అని డా. మేడపాటి ఇమ్మానుయేల్ అన్నారు.

# ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగ్‌ను తిరిగి అప్పగించిన ఆర్పీఎఫ్ సిబ్బంది

**కాజీపేట, 19 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

రైలు ప్రయాణంలో ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగ్‌ను గుర్తించి, అందులోని నగదు, విలువైన పత్రాలను సురక్షితంగా తిరిగి అప్పగించిన కాజీపేట ఆర్పీఎఫ్ సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. హర్యానా రాష్ట్రం పానిపట్‌కు చెందిన చుగ్ దినేష్ (43) ప్రైవేట్ ఉద్యోగి. రాయ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న ఎస్ఎఫ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన ఆయన మంచిర్యాలలో రైలు దిగే సమయంలో తన బ్యాగ్‌ను రైలులోనే మరిచిపోయారు. ఈ విషయం కాజీపేట ఆర్పీఎఫ్ అధికారులకు తెలియడంతో వెంటనే స్పందించిన ఎస్ఐఆర్పీ కాజీపేట అధికారి, విధుల్లో ఉన్న ఆర్పీసీ 619 రాఘవేంద్రతో సమన్వయం చేసి బ్యాగ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బ్యాగ్ యజమాని కాజీపేట ఆర్పీఎఫ్ కార్యాలయానికి చేరుకోగా, ఆయన సమక్షంలో బ్యాగ్‌ను తనిఖీ చేశారు. బ్యాగ్‌లో రూ.37,500 నగదు, చెక్‌బుక్‌లు, విలువైన పత్రాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం బ్యాగ్‌ను దినేష్‌కు సురక్షితంగా అప్పగించారు. తన బ్యాగ్ తిరిగి లభించడంతో దినేష్ ఆనందం వ్యక్తం చేసి ఆర్పీఎఫ్ కాజీపేట అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికుడి సమస్యపై వెంటనే స్పందించి సమయస్ఫూర్తితో బ్యాగ్‌ను తిరిగి అందజేసిన ఆర్పీఎఫ్ సిబ్బందిని తోటి ప్రయాణికులు అభినందించారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# కేయూ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన విద్యార్థులు





**కేయూ క్యాంపస్, 19 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పాలన , మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మానవీయ శాస్త్ర భవనం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విభాగ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 2019 సంవత్సరం నుంచి ప్రభుత్వ పాలన విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి విభాగం ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. "ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటండి.. సెల్ఫీ దిగండి.. సంతకం చేయించుకోండి" అనే నినాదంతో 2019 నుంచి విభాగం ఆవరణలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటినట్లు ఆయన వెల్లడించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా విద్యార్థుల్లో పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డా. ఆకుతోట శ్రీనివాసులు, డా. చీకటి శ్రీను, డా. బుర్రి ఉమాశంకర్, నాగేశ్వరరావు, దామెర దేవదాసు, మాదారపు సురేష్, నక్క చేరాలు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## "ఒక్క విద్యార్థి.. ఒక్క మొక్క".. కేయూలో పర్యావరణ పరిరక్షణకు వినూత్న కార్యక్రమం





**హన్మకొండ, 19 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకతీయ విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పాలన, మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మానవీయ శాస్త్ర భవనం ఆవరణలో విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 2019 సంవత్సరం నుంచి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు "ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటండి.. సెల్ఫీ దిగండి.. సంతకం చేయించుకోండి" అనే నినాదంతో విభాగం ఆవరణలో అనేక మొక్కలు నాటించినట్లు చెప్పారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన ఆలోచనను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డా. ఆకుతోట శ్రీనివాసులు, డా. చీకటి శ్రీను, డా. బుర్రి ఉమాశంకర్, నాగేశ్వరరావు, దామెర దేవదాసు, మాదారపు సురేష్, నక్క చేరాలు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్ లాపరోస్కోపిక్ సర్జరీ ద్వారా అపెండిక్స్‌లోని 15ఐ8 సెం.మీ. మ్యూసినస్ ట్యూమర్ చికిత్స విజయవంతం



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కడుపునొప్పితో బాధపడుతున్న 50 ఏళ్ల వ్యక్తికి, బెంగళూరులోని హూడిలో ఉన్న మెడికవర్ హాస్పిటల్‌లో అపెండిక్స్‌లోని ఒక పెద్ద మ్యూసినస్ ట్యూమర్‌కు విజయవంతంగా చికిత్స అందించారు. ఆ రోగి సుమారు ఒకటిన్నర నెలలుగా కడుపు అంతటా నొప్పి మరియు మలబద్ధకంతో బాధపడుతున్నారు. తదుపరి పరీక్షలలో భాగంగా నిర్వహించిన సిటి స్కాన్, కడుపు కుడి వైపున మరియు కుడి ఇలియాక్ ఫోసాలో అపెండిక్స్ నుండి ఒక కణితి ఏర్పడే అవకాశం ఉందని సూచించింది. శస్త్రచికిత్స సమయంలో, అపెండిక్స్ నుండి ఏర్పడిన 15ఐ8 సెం.మీ. కణితిని గుర్తించారు. పెరిటోనియం మరియు ఇతర ఉదర అవయవాలు సాధారణంగా ఉన్నాయి. రోగికి ఎండ్-టు-సైడ్ ఇలియో-కోలిక్ అనస్టోమోసిస్‌తో కూడిన లాపరోస్కోపిక్ రాడికల్ రైట్ హెమికోలెక్టమీ శస్త్రచికిత్స జరిగింది. మెడికవర్ హాస్పిటల్‌లో సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ మరియు జీఐ ఆంకాలజిస్ట్ అయిన డాక్టర్ యమిని చిత్ర వి. ఆధ్వర్యంలో ఈ శస్త్రచికిత్స జరిగింది. ఈ శస్త్రచికిత్సలో భాగంగా కణితితో సహా పేగులోని ప్రభావిత భాగాన్ని తొలగించి, ఆ తర్వాత పేగు అనుసంధానాన్ని పునర్నిర్మించారు. శస్త్రచికిత్స సమయంలో గానీ, ఆ తర్వాత గానీ ఎటువంటి సమస్యలు తలెత్తలేదు. రోగి ఆరోగ్యం బాగా కోలుకునీ మరియు ప్రస్తుతం చాలా చురుకైన జీవితాన్ని గడుపుతున్నారు. చికిత్స చేయించుకున్న శ్రీనివాస్ మాట్లాడుతూ, "మేము గతంలో చాలా ఆసుపత్రులకు వెళ్ళాము, కానీ ప్రయోజనం లేకపోయింది. ఆ తర్వాత మేము మెడికవర్ హాస్పిటల్‌కు వచ్చినప్పుడు, డాక్టర్ వ్యాధి గురించి చాలా చక్కగా వివరించి, ఆపరేషన్ చేయించుకోవడానికి మమ్మల్ని ప్రోత్సహించి, కేవలం మూడు రోజుల్లోనే ఇంటికి పంపించారు. ఇప్పుడు నేను మునుపటిలాగే నా దైనందిన జీవితాన్ని గడుపుతున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు." డాక్టర్ రూపేష్ కళ్యాణ్ మాట్లాడుతూ, అపెండిక్స్ కణితులు కొన్నిసార్లు కడుపు నొప్పి మరియు మలవిసర్జన వంటి సాధారణ లక్షణాలతో కనిపించవచ్చు. మీకు నిరంతరంగా లేదా కారణం తెలియని కడుపు నొప్పి మరియు ఇతర జీర్ణ సమస్యలు ఉంటే, వాటిని నిర్లక్ష్యం చేయకుండా వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యం. ఈ సందర్భంలో, సకాలంలో చేసిన పరీక్షల ద్వారా అపెండిక్స్‌లోని కణితిని గుర్తించి, అవసరమైన శస్త్రచికిత్సతో విజయవంతంగా చికిత్స అందించారు. అని ఆయన తెలిపారు.

## కేయూ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా మొక్కలు నాటిన రాజనీతి శాస్త్ర విభాగం







**కేయూ క్యాంపస్, 19 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మానవీయ శాస్త్రాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి. కృష్ణయ్య, డాక్టర్ సంకినేని వెంకట్, డాక్టర్ వి. సత్యనారాయణ, డాక్టర్ వి. నాగరాజు, పరిశోధక విద్యార్థులు అంకెల్ల శంకర్, కేతపాక ప్రసాద్‌తో పాటు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణే భవిష్యత్ తరాలకు బలమైన పునాది అని పేర్కొన్నారు. కాకతీయ యూనివర్సిటీ 50వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## నిర్బంధాల పాలనకు కాంగ్రెస్ ప్రభుత్వం నిదర్శనం

### నర్సంపేట బంద్ సందర్భంగా మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ హౌస్ అరెస్ట్



**హన్మకొండ, 19 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ, అక్రమ నిర్బంధాలకు పాల్పడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ పాలనను తలపిస్తోందని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. నర్సంపేట బంద్ సందర్భంగా హనుమకొండలో తనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వరుసగా మూడు రోజులుగా తమను పోలీసులు నిర్బంధంలో ఉంచుతూ కుటుంబ సభ్యులు, నగరవాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వినయ్ భాస్కర్ ఆరోపించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ప్రభుత్వానికి కవచంలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న విధానాలను, అరాచకాలను ప్రశ్నిస్తూ తాము ప్రజల తరపున అడుగులు వేస్తుంటే అధికార మదంతో పోలీసులను ఉసిగొల్పి అక్రమంగా నిర్బంధిస్తున్నారని అన్నారు. ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కి దీనిని ప్రజా పాలనగా చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ తొలగింపునకు నిరసనగా నర్సంపేట ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు పిలుపునిచ్చారని ఆయన తెలిపారు. బంద్‌ను నిర్వహించేందుకు తాము వెళ్లి బలవంతం చేయాల్సిన అవసరం లేదని, ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నారని అన్నారు. అధికార మదంతో పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించగలరేమో కానీ, నర్సంపేట ప్రజల హృదయాల్లో ఆయనపై ఉన్న ఆత్మీయతను చెరిపివేయలేరని వినయ్ భాస్కర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుకుని పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని, ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్బంధాలు, అణచివేత చర్యలను విడనాడి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# దేవాలయ భూమి విక్రయాన్ని అడ్డుకోవాలి

**ఎల్కతుర్తి, 19 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

బావుపేట గ్రామ శివారులోని రామలింగేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన భూమి విక్రయ యత్నాలను తక్షణమే అడ్డుకోవాలని కరీంనగర్-- వరంగల్ ఉమ్మడి జిల్లాల సీపీఐ సీనియర్ నాయకుడు మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 21/38లో సుమారు 38 గుంటల దేవాలయ భూమిపై వివాదం నెలకొన్నట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధి కోసం గ్రామస్తులు, వివిధ ప్రాంతాలు, దేశాల్లో నివసిస్తున్న గ్రామస్థులు, భక్తులు అందించిన విరాళాలతో రూ.50 లక్షలకు పైగా నిధులు సమీకరించి అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. అయితే దేవాలయానికి సంబంధించిన భూమిని అప్పటి కమిటీ చైర్మన్ పొలాటి కిషన్‌రావు పేరుపై రిజిస్ట్రేషన్ చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆ భూమిని సుమారు రూ.37 లక్షలకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దేవాలయ అభివృద్ధి కోసం భక్తులు, గ్రామస్తుల విరాళాలతో అభివృద్ధి చేసిన భూమిని వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించడం సరికాదని మర్రి వెంకటస్వామి స్పష్టం చేశారు. భూమి రిజిస్ట్రేషన్, యాజమాన్య హక్కులు, విరాళాల వినియోగంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు భూమి విక్రయం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# గ్రామీణ ఆరోగ్య సేవలపై డీఎంహెచ్ఓ ప్రత్యేక దృష్టి





## జయగిరి, అనంతసాగర్‌లో ఆయుష్ ఆరోగ్య మందిర్‌లు, నిర్మాణంలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల పరిశీలన

**హన్మకొండ, 19 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య సూచించారు. బుధవారం హసన్‌పర్తి మండలంలోని జయగిరి, అనంతసాగర్ గ్రామాల్లో ఆయన పర్యటించి ఆయుష్ ఆరోగ్య మందిర్‌లలో అందుతున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ముందుగా జయగిరి పల్లె దవాఖాన (ఆయుష్ ఆరోగ్య మందిర్)ను సందర్శించిన డీఎంహెచ్ఓ అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు తీరును పరిశీలించి, అర్హులైన చిన్నారులకు నిర్ణీత సమయంలో టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి నిర్మాణ దశలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలించి నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి, త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని ఆయన సూచించారు. అనంతరం అనంతసాగర్ గ్రామంలోని ఆయుష్ ఆరోగ్య మందిర్‌ను డీఎంహెచ్ఓ సందర్శించారు. టీజీ ఎంఐడీసీ ఏఈ రత్నాకర్, గ్రామ సర్పంచ్ లు తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు, రామంచ వెన్నెల దయాకర్, గ్రామస్తులతో కలిసి నిర్మాణ దశలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతుల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతసాగర్‌లో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను కూడా పరిశీలించి, ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయుష్ ఆరోగ్య మందిర్‌లు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేస్తోందని డీఎంహెచ్ఓ తెలిపారు. ప్రజలు ఈ ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. తల్లి-శిశు ఆరోగ్యం, వ్యాధి నిరోధక టీకాలు, సాధారణ వ్యాధుల నియంత్రణ తదితర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామస్థాయిలో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఎంహెచ్ఓ వెంట హసన్‌పర్తి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ శ్రీరాం భార్గవ్, టీజీ ఎంఐడీసీ ఏఈ రత్నాకర్, జయగిరి సర్పంచ్ వెంకటేశ్వర్లు, అనంతసాగర్ సర్పంచ్ దయాకర్, పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ మల్లేశ్, హెల్త్ సూపర్‌వైజర్ లచ్చు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ చారిత్రాత్మకం



**కేయూ, 19 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నూతనంగా ప్రతిష్ఠించిన తొలి తెలుగు బహుజన చక్రవర్తి, భారతమాత ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. ఈ విగ్రహావిష్కరణ మహోత్సవంలో కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ చిర్ర రాజు గౌడ్ మాట్లాడుతూ.. గత పాలకుల హయాంలో సాధ్యం కాని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ఠను ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చేపట్టి ఘనంగా ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు, తెలంగాణ పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌కు యావత్ బహుజన సమాజం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గర్వకారణమని డాక్టర్ చిర్ర రాజు గౌడ్ పేర్కొన్నారు.

# రాయదుర్గం పోలీసులకు కోర్టు నోటీసులు

**హైదరాబాద్,ఆగస్ట్19(జై భీమ్ న్యూస్):**

పోక్సో కేసులో నిందితుడిని వేధించి చిత్రహింసలకు గురిచేశారన్న ఆరోపణల నేపథ్యంలో రాయదుర్గం పోలీసులకు రాజేంద్రనగర్ కోర్టు నోటీసులు జారీ చేసింది. రిమాండ్ సమయంలో నిందితుడి ఒంటిపై గాయాలను న్యాయవాది కోర్టుకు చూపించారు. దీంతో రాజేంద్రనగర్ కోర్టు తక్షణమే నిందితుడిని విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. నిందితుడిని వేధింపులకు గురిచేసిన అంశంపై షోకాజ్ నోటీసులు జారీచేసింది. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని రాయదుర్గం పోలీసులను కోర్టు ఆదేశించింది. నిందితుడి రిమాండ్ రిజెక్ట్ చేస్తూ బెయిల్ మంజూరు చేసింది.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి



**హన్మకొండ, 19 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. హన్మకొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్ పాయి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 17న విడుదలైన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, జాబితా వివరాలను వారికి తెలియజేయాలని సూచించారు. వారి నుంచి వచ్చే క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, తమ వివరణలు, అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. నోటీసుల అనంతరం అందే వివరణలను పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఓటు హక్కు ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. జిల్లాలో మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్‌గా గుర్తించిన వారికి నోటీసులు జారీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని వివరించారు. సమావేశంలో ఆర్డీవోలు వెంకటేష్, వెంకన్న, ఎలక్షన్ సూపరింటెండెంట్ జగత్ సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# వరంగల్ మున్సిపాలిటీ లో "ఆర్ఐ"లకు దీర్ఘకాల పోస్టింగ్‌లు!!

**మూడు ఏళ్ల నిబంధనకు తూట్లు..**
**ఒకరు ఆరేళ్లుకు పైగా .. ముగ్గురు నాలుగేళ్లకు పైగా**
**ఒకే విభాగంలో ఏళ్ల తరబడి ఆర్ఐల తిష్టపై ప్రశ్నలు**

**వరంగల్, 19 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐ) లు ఒకే విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ల తరబడి కొనసాగుతున్నారనే ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. సాధారణంగా ఉద్యోగులను ఒకే విభాగంలో దీర్ఘకాలం కొనసాగించకుండా పరిపాలనా అవసరాల మేరకు బదిలీలు, విభాగ మార్పులు చేపట్టాల్సి ఉండగా,ముగ్గురు ఆర్ఐలు నాలుగు సంవత్సరాలుగా, ఒకరు ఏకంగా ఆరు సంవత్సరాలుగా ఒకే చోట కొనసాగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### నిబంధన ఉంటే అమలు చేసేది ఎవరు?

ఒకే విభాగంలో మూడు సంవత్సరాలకు మించి పని చేయకూడదు అనే నిబంధన ప్రభుత్వ ఉత్తర్వులో ఉంటే, ఎందుకు అమలు చేయడం లేదనే ప్రశ్నలు ఉద్యోగ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాల్సి ఉండగా, కొందరికి మాత్రం మినహాయింపులు ఎలా లభిస్తున్నాయన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. మూడు సంవత్సరాల కాలపరిమితిపై ప్రశ్నించినప్పుడు ఒక ఆర్ఐ, "అలాంటి రూల్ ఉందా? అలాంటి జీవో ఉందా?" అని, మరో ఆర్ఐ మాత్రం "మీకు ఇష్టం వచ్చినట్లు రాసుకోండి" అని అన్నారు. మరో ఇద్దరు ఆర్ఐలు మీడియా ప్రతినిది ఫోన్‌కాల్స్‌కు స్పందించకపోవడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది.

### మీడియా ఫోన్‌కే స్పందన లేకపోతే.. ప్రజల పరిస్థితి ఏమిటి?

### 'పెద్దల అండ' ఉందా?


ఒకే చోట ఏళ్ల తరబడి కొనసాగుతున్న వారి వెనుక ఎవరైనా ఉన్నతాధికారుల అండ ఉందా? అనే అనుమానాలు ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఇవి ప్రస్తుతం ఆరోపణలు, అనుమానాల స్థాయిలోనే ఉన్నాయి. వాటికి అధికారిక ధృవీకరణ రావాల్సి ఉంది. నిజంగా నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్‌లు కొనసాగుతున్నాయా? ఉంటే వాటికి బాధ్యత ఎవరిది? బదిలీ నిబంధనలు అమలు చేయకుండా ఇంతకాలం కొనసాగించడానికి కారణాలేమిటి? పెండింగ్ పనులపై ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? వంటి అంశాలపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగులోకి

ఒకే విభాగంలో మూడు సంవత్సరాలకు మించి పనిచేస్తున్న ఆర్ఐల పూర్తి జాబితాను, వారి ప్రస్తుత పోస్టింగ్ తేదీలను, గత బదిలీ వివరాలను, పెండింగ్‌లో ఉన్న ప్రజా పనుల వివరాలను, వారిపై వచ్చిన ఫిర్యాదులు--చర్యల వివరాలను ఉన్నతాధికారులు బహిర్గతం చేస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి ఒకే స్థానంలో కొనసాగుతున్న ఆర్ఐల వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

# హరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షులు అరికిల్ల అశోక్ కన్నుమూత

**హసన్‌పర్తి, 19 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామానికి చెందిన హరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షులు అరికిల్ల అశోక్ గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు, మత్స్యకార సంఘం సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అరికిల్ల అశోక్ హరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులుగా, ఫాస్టర్‌గా పనిచేస్తూ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి, సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. సంఘ సభ్యులతో సన్నిహితంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేసేవారని పలువురు గుర్తుచేశారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అశోక్ మృతి సంఘానికి, మత్స్యకార సమాజానికి తీరని లోటని హరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు అన్నారు. సంఘ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. అరికిల్ల అశోక్ మృతికి హరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మడిపల్లి అధ్యక్షులు కాందారి ఆంజనేయులు, ఉపాధ్యక్షురాలు బందెల చిలక, కార్యదర్శి సంద్ర రంజిత్, డైరెక్టర్లు కాందారి విద్యాసాగర్, చిట్యాల కిషన్, కలిపెల్లి రాజు, బూర సురేందర్, కాందారి కొమురయ్య, చిట్యాల సుగుణలు సంతాపం వ్యక్తం చేశారు. అశోక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

న్యూఢిల్లీ,ఆగస్ట్19(జై భీమ్ న్యూస్):నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్-2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

## మరిచిపోయిన ఫోన్‌ను తిరిగిచ్చిన ఆటో డ్రైవర్.. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం



**హసన్‌పర్తి, 19 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

నిజాయితీ, మానవత్వాన్ని చాటుకున్నారు భీమారం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కటుకూరి సోను. ఆటోలో ప్రయాణించిన ఏఎన్ఎం సిస్టర్స్ తమ సెల్‌ఫోన్‌ను ఆటోలోనే మర్చిపోయి వెళ్లిపోయారు. ఫోన్‌ను గుర్తించిన సోను దానిని భద్రంగా ఉంచి, అనంతరం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. హసన్‌పర్తి సీఐ ఆకునూరి మహేందర్ చేతుల మీదుగా సంబంధిత ఏఎన్ఎం సిస్టర్స్‌కు సెల్‌ఫోన్‌ను తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా సోను చూపిన నిజాయితీ, బాధ్యతాయుతమైన ప్రవర్తనను పలువురు అభినందించారు. సోను చేసిన సేవను గుర్తించిన హసన్‌పర్తి మన తెలంగాణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు తాళ్ల మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నేటి రోజుల్లో ఇతరుల వస్తువులపై ఆశపడకుండా, నిజాయితీగా వ్యవహరించి సెల్‌ఫోన్‌ను యజమానులకు తిరిగి అందజేసిన కటుకూరి సోను అభినందనీయుడని అన్నారు. ఆటో డ్రైవర్లలో మానవత్వానికి, నిజాయితీకి సోను మంచి ఉదాహరణగా నిలిచారని కొనియాడారు.

## రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు

**హత్యకు పాల్పడింది ..అదే స్కూల్‌లోని ఇద్దరు టెన్త్ స్టూడెంట్స్**
**జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం ప్రిన్సిపల్ హత్య**
**వివరాలు తెలియడంతో విస్తుపోయిన టీచర్లు, స్టూడెంట్స్**

**నల్గొండ,ఆగస్ట్19(జై భీమ్ న్యూస్):**

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె.రూపారెడ్డి హత్య కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆమె నిర్వహిస్తున్న పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులే రూపారెడ్డిని హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. డబ్బుల కోసమే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనలో విద్యార్థుల పాత్ర బయటకు రావడంతో తోటి విద్యార్థులు,టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి దుర్మార్గానికి ఒడిగడతారని అనుకోలేదని అంటున్నారు. ఈ నెల 11న కొండమల్లేపల్లి మండలంలోని వేర్వేరు తండాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మాస్క్, హుడీ ధరించి రూపారెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. ఒక విద్యార్థి ఇంట్లోకి వెళ్లి డబ్బులు ఇవ్వాలని బెదిరించగా.. ఆమె ప్రతిఘటించారు. మాస్క్ ఊడిపోవడంతో విద్యార్థిని గుర్తించి కేకలు వేశారు. గుర్తింపు బయటపడటంతో వెంట తీసుకెళ్లిన కత్తితో రూపారెడ్డిని పొడిచి హత్య చేశాడు. అనంతరం ఇంట్లో ఉన్న రూ.2.20లక్షలు తీసుకుని బయట ఉన్న మరో విద్యార్థికి రూ.40వేలు ఇచ్చాడు. ఇద్దరు విద్యార్థులు చోరీలు చేస్తూ జల్సాలకు అలవాటు పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. విచారణ సమయంలో విద్యార్థి జేబులో ఉన్న రూ.1.60లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు రక్తపు మరక ఉండటాన్ని గుర్తించారు. రక్తపు మరకలపై ప్రశ్నించడంతో విద్యార్థులు నిజం అంగీకరించారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్19(జై భీమ్ న్యూస్):**

భారత్‌లో ఈ వారం మొదటి నుంచీ బంగారం ధరలు ప్రతి రోజూ ఓ మోస్తరు స్థాయిలో పెరుగుతూనే ఉన్నాయి. యూఎస్ ఫెడ్ ప్రామాణిక వడ్డీ రేటు పెరగదన్న అంచనాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారు. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఆగస్టు 19) ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,900గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,42,910 వద్ద కొనసాగుతోంది.

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యకేసు

### పాఠశాల విద్యార్థులే హంతకులుగా నిర్ధారణ

**నల్గొండ,ఆగస్ట్19(జై భీమ్ న్యూస్):**

కొండమల్లెపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ కె. రూపారెడ్డి హత్య ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నెల 11న జరిగిన ఈ హత్య కేసుకు సంబంధించి పోలీసులు మిస్టరీని ఛేదించారని సమాచారం. ఈ దారుణానికి పాల్పడింది అదే పాఠశాలలో చదివిన వంశీ, అనిల్ అనే విద్యార్థులే అని విచారణలో తేలినట్లు సమాచారం. డబ్బుల కోసం ఆశపడే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. హత్య అనంతరం నిందితులు గోవాకు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఈ కేసులో విద్యార్థుల ప్రమేయం ఉండటం స్థానికంగా దిగ్భ్రాం÷-రతిని కలిగించింది. సుమారు 80 మందిని విచారించిన అనంతరం ఆ విద్యార్థులే ఈ దారుణానికి పాల్పడ్డారని గుర్తించినట్లు సమాచారం. రూపారెడ్డి హత్య అనంతరం ఆ విద్యార్థులు సుమారు రూ.4 లక్షల నగదు చోరీ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# మిలిటరీ మద్యం అక్రమ విక్రయం.. 22 స్కాచ్ బాటిళ్లు సీజ్



**హైద్రాబాద్, 19 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

మిలిటరీ క్యాంటీన్‌కు చెందిన రాయితీ మద్యాన్ని అక్రమంగా బయట విక్రయిస్తున్న వ్యక్తిని మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. కాప్రాలోని నిందితుడి నివాసంలో నిర్వహించిన తనిఖీల్లో 22 ఖరీదైన స్కాచ్ విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల వివరాల ప్రకారం.. కాప్రా శక్తినగర్, ఆర్‌కే పురానికి చెందిన రాధా కురుశ్యామల్ మిలిటరీ క్యాంటీన్ నుంచి తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి, కాప్రా ప్రాంతంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటమ్మ ఆధ్వర్యంలో అధికారులు నిందితుడి ఇంటిపై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇంట్లో దాచి ఉంచిన 22 స్కాచ్ విస్కీ బాటిళ్లను గుర్తించి సీజ్ చేశారు. క్యాంటీన్ నుంచి రాయితీపై పొందిన మద్యాన్ని బ్రాండ్‌ను బట్టి ఒక్కో బాటిల్‌పై రూ.500 నుంచి రూ.1,000 వరకు అదనపు లాభం వేసుకుని విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. రక్షణ శాఖ లబ్ధిదారుల కోసం కేటాయించిన మద్యాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు తెలిపారు. సీజ్ చేసిన మద్యంతో పాటు నిందితుడిని కాప్రా ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్ రావు తెలిపారు. ఈ అక్రమ మద్యం విక్రయాల వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

**రూ.1.50 కోట్ల హషీష్ ఆయిల్ పట్టివేత**

మరోవైపు ఏపీ నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు హషీష్ ఆయిల్ తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, వనస్థలిపురం పోలీసులు పట్టుకున్నారు. చింతల్‌కుంట--వనస్థలిపురం ప్రాంతంలో నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.1.50 కోట్ల విలువైన 12 కిలోల హషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు కాళ్లు, పొట్టకు ప్యాకెట్లు కట్టుకుని హషీష్ ఆయిల్‌ను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వారి నుంచి ఐదు మొబైల్ ఫోన్లు, రూ.5 వేల నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు డబ్బు ఆశ చూపించి క్యారియర్లుగా వినియోగిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. హషీష్ ఆయిల్‌ను బెంగళూరుకు తరలించేందుకు రూ.10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రధాన సరఫరాదారు కృష్ణ, బెంగళూరులో డ్రగ్స్‌ను స్వీకరించాల్సిన సిజో కోసం పోలీసులు గాలిస్తున్నారు. ముఠా వెనుక ఉన్న పెద్ద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతోంది. ఎల్‌బీనగర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ వివరాలు వెల్లడించారు. మత్తు మాఫియా మూలాలను గుర్తించి మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదిస్తామని ఆమె తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని సీపీ కోరారు. మత్తు రహిత సమాజమే మల్కాజిగిరి పోలీసుల లక్ష్యమని స్పష్టం చేశారు.

## డ్రగ్స్ రాకెట్ ముఠా గుట్టురట్టు

### ముగ్గురు డ్రగ్స్ సరఫరాదారుల అరెస్ట్

**హైదరాబాద్,ఆగస్ట్19(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు. బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం. నిందితురాలిని విచారించగా.. కేరళలో ఉండే తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించింది. పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు మరింత ముమ్మరంగా కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నెంబర్ 8712663061కు ఫిర్యాదు చేయాలని డీసీపీ సూచించారు.

## బిసిల పట్ల కట్టప్పలా మారిన జగన్

**బిసి రిజర్వేషన్లపై ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి**

**అమరావతి,ఆగస్ట్19(జై భీమ్ న్యూస్):**

రాష్ట్రంలో బీసీల పాలిట జగన్మోహన్ రెడ్డి కట్టప్పలా వ్యవహరించి వెన్నుపోటు పొడిచి అన్యాయం చేశారని ఆదోని నియోజకవర్గం భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన బీసీ రిజర్వేషన్లపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు నిర్ణయించడం హర్షించదగ్గ విషయమన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 16,800 మంది బీసీలకు అవకాశం దక్కుతుందన్నారు. బీసీ వర్గీకరణ చేపట్టి రాజకీయ పదవులు అందరికీ అందేలా చూడాలన్నారు. గత వైకాపా ప్రభుత్వం బీసీలను రాజకీయంగా వాడుకునేందుకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని జీవోలు జారీచేసి.. చివరికి 24 శాతానికి కుదించి తీవ్రంగా అన్యాయం చేశారన్నారు. నీతి ఆయోగ్ సూచనలు మేరకు ప్రత్యక్ష విధానంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించడం శుభ పరిమాణం అన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాం నుంచి బీసీల పట్ల తెలుగుదేశం పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆదోని పట్టణంలో రహదారులను విస్తరించి ట్రాఫిక్ సమస్యలను తగ్గించాలని ఆదోని భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరారు. 1987 తర్వాత ఇప్పుడు 2025లో వంద అడుగుల వెడల్పుతో మాస్టర్ ఎ÷-లాన్ వచ్చిందన్నారు. దీనిని అమలు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని పురపాలక శాఖ మంత్రి నారాయణను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించడం వల్ల పారదర్శకతతో పాటు అక్రమాలకు తావుండదన్నారు. గత వైకాపా పాలనలో ఆదోని పురపాలక సంఘంలో ఇద్దరు ఛైర్‌పర్సన్‌లను మార్చిన ఘనత ఆ పార్టీకే దక్కిందన్నారు. ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకొస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బిఆర్ఎస్ పిలుపు

**హరీష్ రావు, తలసాని శ్రీనివాస యాదవ్‌ల హౌజ్ అరెస్ట్**

**హైదరాబాద్,ఆగస్ట్19(జై భీమ్ న్యూస్):**

మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కోకాపేట్‌లోని హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ సందర్శనకు హరీశ్ రావు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నగరం నలువైపులా 'టిమ్స్' పేరుతో సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణ పనులకు కేసీఆర్ శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులను పరుగులు పెట్టించారు. అసెంబ్లీ ఎన్నికల సమయానికి అంటే ఏడాది కాలంలోనే అన్ని దవాఖానల నిర్మాణ పనులు 60 శాతానికిపైగా పూర్తయ్యాయి. గత సంవత్సరమే మూడు సూపర్ స్పెషాలిటీ దవాఖానలు అందుబాటులోకి రావాల్సి ఉండగా, ప్రస్తుతం సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే హడావుడిగా ప్రారంభోత్సం చేశారు. ఈ నేపథ్యంలో హరీశ్ రావు హాస్పిటల్ సందర్శనకు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. నత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది. అలాగే మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సనత్ నగర్‌లో నూతనంగా ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని బీఆర్ఎస్ హై కమాండ్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, అడ్డుకునేందుకు తమను హౌస్ అరెస్ట్‌లు, అక్రమ నిర్బంధాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సనత్ నగర్, అమీర్‌పేట డివిజన్‌లకు చెందిన ముఖ్య నాయకులను పోలీసులు ఎందుకు హౌస్ అరెస్ట్ చేశారని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.

## మండలిలో డిఎస్సీపై వైసిపి వాయిదా తీర్మానం

**తిరస్కరించిన ఛైర్మన్..కాసేపు మండలి వాయిదా**

**అమరావతి,ఆగస్ట్19(జై భీమ్ న్యూస్):**

ఏపీ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు మూడో రోజు ప్రారంభమయ్యాయి. బుధవారం శాసనమండలిలో మెగా డీఎస్సీపై వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ వాయిదా తీర్మానాన్ని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ఛైర్మన్ పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆందోళనతో శాసనమండలిలో గందరగోళం నెలకొంది. డీఎస్సీపై చర్చ పెట్టాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. పోడియాన్ని చుట్టుముట్టి ఆ పార్టీ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మెడలో నల్ల కండువాలతో ఆ పార్టీ సభ్యులు సభకు వచ్చారు. వైసీపీ సభ్యులు ఆందోళనతో ఏపీ శాసన మండలిని ఛైర్మన్ కాసేపు వాయిదా వేశారు. వైసీపీ సభ్యులు సభను గౌరవించటం లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. ఛైర్మన్ సభను ఆర్డర్‌లో పెట్టాలని సూచించారు. ఛైర్మన్ టేబుల్‌ను కొడుతూ ఎందుకు నినాదాలు చేస్తున్నారని ప్రశ్నించారు. సభా మర్యాద కాపాడాల్సిన బాధ్యత సభ్యులపైనా ఉందని తెలిపారు. మనోహర్ వ్యాఖ్యలపై ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు అసహనం వ్యక్తం చేశారు. సభా నిర్వహణ, నిబంధనల గురించి మీకు బాగా తెలుసు అని అన్నారు. వారిపై ఎలాంటి చర్యలు ఎలా తీసుకోవాలో మీకు తెలుసునని చెప్పారు. సభ సంప్రదాయాల ప్రకారం జరగాలని ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జగన్ హయాంలో కూడా మీరు ఛైర్మన్‌గా వ్యవహరించారని అన్నారు. రెడ్ లైన్ గీసి విపక్షాల వాళ్లు దాటి వస్తే సస్పెండ్ చేశారని ప్రస్తావించారు. ఇప్పుడు కూడా అలాగే చేసేందుకు మీకు అధికారాలున్నాయని తెలిపారు. మూడు రోజులుగా సభకు అంతరాయం కలిగిస్తుంటే చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని నిలదీశారు. ఛైర్మన్‌ను కించపరచాలనే ఆలోచన తమకు లేదని.. ఆయనకు పవర్స్ ఉన్నాయని చెప్పారు.

# బొద్దింకలకు.. మీ ఇల్లే స్వర్గమా?











- ఇల్లు శుభ్రంగా ఉన్నా బొద్దింకలు రావడానికి దాగి ఉన్న కారణాలు
- తడి స్పాంజ్‌లు, వంటగది గుడ్డలు బొద్దింకలకు ఆశ్రయం
- స్టవ్, ఎగ్జాస్ట్, క్యాబినెట్లపై పేరుకునే జిడ్డు వాటికి ఆహారం
- కార్డ్‌బోర్డ్ పెట్టెలు, పాత పేపర్లలో సులభంగా దాక్కునే బొద్దింకలు
- పెంపుడు జంతువుల ఆహార పాత్రలు కూడా ప్రమాదకరమే
- ఖాళీ బాటిళ్లు, డబ్బాల్లోని తీపి అవశేషాలు బొద్దింకలకు విందు
- లీకేజీలు, తడి మూలలు వాటి సంతానోత్పత్తికి అనుకూలం
- రాత్రివేళ వంటగదిలో చిన్న పొరపాట్లు పెద్ద సమస్యగా మారుతున్నాయి
- చిన్న జాగ్రత్తలతోనే బొద్దింకల బెడదకు చెక్ పెట్టొచ్చు
- పరిశుభ్రమైన వంటగదే ఆరోగ్యకరమైన కుటుంబానికి పునాది

**వంటగదిని ప్రతిరోజూ శుభ్రం చేస్తున్నా బొద్దింకలు కనిపిస్తుంటే కేవలం మిగిలిపోయిన ఆహారమే కారణం కాదని నిపుణులు చెబుతున్నారు. తడి స్పాంజ్ లు, స్టవ్ చుట్టూ పేరుకుపోయే జిడ్డు, కార్డ్ బోర్డ్ పెట్టెలు, ఖాళీ బాటిళ్లలో మిగిలే అవశేషాలు వంటి చిన్నచిన్న నిర్లక్ష్యాలే వాటికి ఆశ్రయంగా మారుతున్నాయి. లీకేజీలు, తేమ ఎక్కువగా ఉండే ప్రదేశాలు బొద్దింకల పెరుగుదలకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయి. పెంపుడు జంతువుల ఆహారాన్ని రాత్రంతా బయట ఉంచడం కూడా వాటిని ఆకర్షించే ప్రధాన కారణాల్లో ఒకటి. కేవలం పురుగుమందులు వాడడం కాకుండా ఇంటి పరిశుభ్రతతో పాటు ఈ అలవాట్లను మార్చుకుంటే బొద్దింకల సమస్యను గణనీయంగా తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. చిన్న చిన్న జాగ్రత్తలే వంటగదిని పరిశుభ్రంగా, ఇంటిని ఆరోగ్యకరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి.**



కొత్త స్వరం | లైఫ్ స్టైల్ |

ఇంటిని ప్రతిరోజూ శుభ్రం చేస్తారు... వంటగదిని మెరిసేలా ఉంచుతారు... అయినా బొద్దింకలు మాత్రం ఎక్కడి నుంచో వచ్చి ఇబ్బంది పెడుతుంటాయి. దీంతో చాలామంది ఇల్లు అపరిశుభ్రంగా ఉందేమోనని భావిస్తారు. కానీ బొద్దింకలను ఆకర్షించేది కేవలం మిగిలిపోయిన ఆహారం మాత్రమే కాదని నిపుణులు చెబుతున్నారు. వంటగదిలో మనం పెద్దగా పట్టించుకోని తడి స్పాంజ్‌లు, జిడ్డు, కార్డ్‌బోర్డ్ పెట్టెలు, లీకేజీలు, ఖాళీ డబ్బాలు వంటి ఎన్నో అంశాలు వాటికి ఆశ్రయం, ఆహారం, నీటిని అందిస్తున్నాయి. చిన్నచిన్న అలవాట్లను మార్చుకుంటే బొద్దింకల బెడదను గణనీయంగా తగ్గించవచ్చని పరిశుభ్రత నిపుణులు సూచిస్తున్నారు. వంటగదిలో కనిపించని ఈ ప్రమాదాలను గుర్తించడం ప్రతి కుటుంబానికి అవసరమని హెచ్చరిస్తున్నారు.

### కనిపించని మూలల్లోనే బొద్దింకల రాజ్యం

చాలామంది బొద్దింకలు అంటే మురికిగా ఉన్న ఇళ్లలోనే ఉంటాయని అనుకుంటారు. కానీ అది పూర్తిగా నిజం కాదు. పరిశుభ్రమైన ఇళ్లలో కూడా వాటికి అనుకూలమైన పరిస్థితులు ఉంటే అవి సులభంగా చేరుకుంటాయి. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, వరుస ఇళ్లలో ఒక ఇంటి నుంచి మరో ఇంటికి డ్రైనేజీ పైపులు, గోడల పగుళ్లు, వెంటిలేటర్ల ద్వారా బొద్దింకలు సులభంగా ప్రవేశిస్తాయి. ఒకసారి ఇంట్లోకి వచ్చిన తర్వాత వాటికి ఆహారం, నీరు, దాక్కునే ప్రదేశం లభిస్తే వేగంగా సంఖ్య పెరుగుతుంది.

### తడి స్పాంజ్‌లు.. సూక్ష్మజీవులతో పాటు బొద్దింకలకూ ఇష్టమే

పాత్రలు కడిగే స్పాంజ్‌లు, వంటగది గుడ్డలు ఎక్కువసేపు తడిగానే ఉంటాయి. వాటిలో చిక్కుకుపోయిన ఆహార కణాలు బొద్దింకలకు ఆహారంగా మారతాయి. తేమ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఇవి ఎక్కువసేపు జీవించగలవు. అందుకే స్పాంజ్‌ను ప్రతి రోజు శుభ్రం చేసి పూర్తిగా ఆరబెట్టాలి. రెండు నుంచి మూడు వారాలకు ఒకసారి కొత్త స్పాంజ్‌ను ఉపయోగించడం మంచిది.

### స్టవ్‌పై కనిపించని జిడ్డే పెద్ద సమస్య

స్టవ్ చుట్టూ పేరుకునే నూనె, కూర మసాలాల జిడ్డు మనకు చిన్న విషయం అనిపించినా బొద్దింకలకు అది సమృద్ధిగా ఆహారం. ఎగ్జాస్ట్ హుడ్, స్టవ్ వెనుక భాగం, గ్యాస్ పైప్, క్యాబినెట్ హ్యాండిల్స్‌పై పేరుకుపోయే జిడ్డును వారానికి కనీసం ఒకసారి శుభ్రం చేయాలి.

### కార్డ్‌బోర్డ్ పెట్టెలు.. వాటి సేఫ్ హౌస్

ఆన్‌లైన్‌లో వచ్చిన పార్సిల్ పెట్టెలు, పాత వార్తాపత్రికలు, కాగితపు సంచులు బొద్దింకలకు దాక్కునేందుకు అద్భుతమైన ప్రదేశాలు. ఇవి తేమను పీల్చుకోవడం వల్ల బొద్దింకలు గుడ్లు పెట్టడానికి కూడా అనుకూలంగా మారతాయి. అవసరం లేని పెట్టెలను వెంటనే తొలగించడం మంచిది.

### పెంపుడు జంతువుల ఆహారం రాత్రంతా ఉంచొద్దు

పిల్లులు, కుక్కల కోసం పెట్టిన ఆహారం రాత్రంతా అలాగే ఉంటే అది బొద్దింకలకు విందుగా మారుతుంది. పెట్ ఫుడ్‌ను మూత ఉన్న డబ్బాల్లోనే నిల్వ చేయాలి. తిన్న తర్వాత పాత్రలను వెంటనే శుభ్రం చేయాలి.

### ఖాళీ బాటిళ్లు, డబ్బాల్లో తీపి అవశేషాలు

కూల్‌డ్రింక్ క్యాన్లు, జ్యూస్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ బాటిళ్లలో మిగిలిన చక్కెర పదార్థాలు బొద్దింకలను బాగా ఆకర్షిస్తాయి. రీసైక్లింగ్‌కు పంపే ముందు వాటిని నీటితో శుభ్రం చేయడం అలవాటు చేసుకోవాలి.

### నీరు ఉంటే బొద్దింకలు బతుకుతాయి

లీకవుతున్న ట్యాప్‌లు, సింక్ కింద తడి, ఫ్రిజ్ వెనుక పేరుకునే నీరు, డ్రైనేజీ లీకేజీలు బొద్దింకలకు జీవనాధారం. అవి ఆహారం లేక కొంతకాలం జీవించగలవు కానీ నీరు లేక ఎక్కువ రోజులు బతకలేవు. అందుకే ఇంట్లో లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలి.

### చెత్త బుట్ట కూడా శుభ్రంగా ఉండాలి

కేవలం చెత్తను బయట వేయడం సరిపోదు. చెత్త బుట్టను కూడా వారానికి రెండు మూడు సార్లు శుభ్రం చేయాలి. మూత ఉన్న చెత్త బుట్టను మాత్రమే ఉపయోగించడం మంచిది.

### చిన్న పగుళ్లు.. పెద్ద ప్రమాదం

గోడల పగుళ్లు, క్యాబినెట్ల వెనుక భాగం, సింక్ కింద ఉండే చిన్న రంధ్రాలు బొద్దింకల దాక్కునే ప్రదేశాలు. వీటిని సిలికాన్ సీలెంట్‌తో మూసివేస్తే వాటి సంచారం తగ్గుతుంది.

### పురుగుమందుల కంటే పరిశుభ్రతే శాశ్వత పరిష్కారం

పురుగుమందులు తాత్కాలికంగా బొద్దింకలను తగ్గించవచ్చు. కానీ వాటి ఆహారం, నీరు, ఆశ్రయాన్ని తొలగించకపోతే అవి మళ్లీ వస్తాయి. అందుకే పరిశుభ్రత, పొడి వాతావరణం, సరైన నిల్వ విధానాలే శాశ్వత పరిష్కారం.


### ఆరోగ్యానికి కూడా ముప్పే

బొద్దింకలు కేవలం అసహ్యం కలిగించే పురుగులు మాత్రమే కావు. ఇవి ఈ-కోలై, సాల్మొనెల్లా వంటి బ్యాక్టీరియాను వ్యాప్తి చేయడంతో పాటు అలెర్జీలు, ఆస్తమా సమస్యలను కూడా పెంచే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్న ఇళ్లలో వీటి నియంత్రణ అత్యంత అవసరం.

### బొద్దింకలు రాకుండా ఉండాలంటే...

- ✔ స్పాంజ్‌లు, గుడ్డలను పొడిగా ఉంచండి.
- ✔ స్టవ్, సింక్, క్యాబినెట్లను ప్రతిరోజూ తుడవండి.
- ✔ ఆహారాన్ని గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ చేయండి.
- ✔ కార్డ్‌బోర్డ్ పెట్టెలను ఇంట్లో ఎక్కువ రోజులు ఉంచొద్దు.
- ✔ చెత్తను ప్రతిరోజూ బయట వేయండి.
- ✔ లీకేజీలను వెంటనే సరిచేయండి.
- ✔ పెంపుడు జంతువుల ఆహారాన్ని రాత్రంతా బయట ఉంచొద్దు.
- ✔ గోడల పగుళ్లు, రంధ్రాలను మూసివేయండి.






# రాకాలో హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్


అగ్ర నటుడు అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ బ్జడెట్ మూవీ 'రాకా'. హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మేకర్స్ గతేడాది నుంచి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అలాగే, షారుక్ ఖాన్ కూడా 'రాకా'లో భాగమేనని టాక్. విల్ స్మిత్, షారుక్, అల్లు అర్జున్ ఒకే ఫ్రేమ్‌లో వస్తే 'రాకా' భారీ సెన్సేషన్ మూవీ కావడం ఖాయమే. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పలు భాషల్లో 2027లో విడుదల చేయనున్నారు.

# 24న మహాకాళి ఫస్ట్ గ్లింప్స్

పాన్ ఇండియా స్థాయిలో సంచలనాలు సృష్టించిన 'హనుమాన్' చిత్రంతో 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'కు శ్రీకారం చుట్టిన టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఇప్పుడు మరో భారీ విజువల్ వండర్‌కు సిద్ధమయ్యారు. పీవీసీయూ నుంచి వస్తున్న తన తదుపరి భారీ చిత్రం 'మహాకాళి' చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను తాజాగా వెల్లడించారు మేకర్స్. 'ది ఎండ్ బిగిన్స్' అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఆగస్టు 24న ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయబోతున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించాడు. ఇక ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ సృష్టికర్తగా వ్యవహరిస్తుం డగా, పూజ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఈ చిత్రాన్ని ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, భూమి శెట్టి ప్రధాన టైటిల్ పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు శ్రీయారెడ్డి, రోహిత్ సరాఫ్, ఖుష్బూ సుందర్, రాజేష్ బేడి, పోసాని మురళీ శర్మ, నాజర్, రజత్ కపూర్ వంటి ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. మైథలాజికల్ సూపర్‌హీరో జోనర్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సురేశ్ రఘు సినిమాటోగ్రఫీ అందించగా, శ్రీనాగేంద్ర ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హనుమాన్ సినిమాతో సూపర్‌హీరో కాన్సెప్ట్‌ను పరిచయం చేసిన ప్రశాంత్ వర్మ, 'మహాకాళి'తో ఏ స్థాయి విజువల్ ట్రీట్ ఇస్తారోనని సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# టాక్సిక్ ..పెద్దల సినిమా మాత్రమే

**పిల్లలు చూడొద్దన్న నటుడు యశ్**




సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'టాక్సిక్ యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం' అని చెప్పారు. ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. 'ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం' అని యశ్ అన్నారు.

# అనుకున్న సమయానికే స్పిరిట్ విడుదల

**వాయిదా వార్తలను ఖండించిన టీమ్**

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ – వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట్' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. 'స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పూ లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని క్లారిటీ ఇచ్చింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రి కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



# వియత్నాం టూర్‌లో సమంత, రాజ్ నిడుమోరు



టాలీవుడ్ స్టార్ నటి సమంత ప్రస్తుతం వియత్నాంలో తన భర్త, ప్రముఖ దర్శక–నిర్మాత రాజ్ నిడిమోరు తో కలిసి బేబీమూన్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. త్వరలోనే తాము మొదటి బిడ్డకు స్వాగతం పలకబోతున్న నేపథ్యంలో, ఈ ప్రత్యేకమైన క్షణాలను ఆస్వాదించేందుకు ఈ క్యూట్ కపుల్ వియత్నాం వెకేషన్‌కు వెళ్లారు. అక్కడి సుందరమైన ప్రదేశాలను చుట్టేయడంతో పాటు, పలు రకాల ఫన్ యాక్టివిటీస్‌లో సమంత ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే అక్కడి ప్రత్యేకమైన స్థానిక ఫుడ్‌ను టేస్ట్ చేస్తూ ఎంజాయ్ చేసిన వీడియోలు, ఫోటోలను ఆమె సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ బేబీమూన్ పిక్స్ మరియు వీడియోలు నెట్టింట వైరల్ అవుతుండగా, టాలీవుడ్ ప్రముఖులు, అభిమానులు ఈ దంపతులకు శు భాకాంక్షలు తెలుపుతున్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM